క్లుప్తంగా

కాళికాంబకు ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం నిత్య పూజలతో పాటు వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల, డబ్ల్యూ కొత్తపల్లె, బుర్రారెడ్డిపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జయప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల ప్రస్తుత పరిస్థితి, వసతులు, విద్యుత్ సౌకర్యం, గోడలు, మెత్తు, ఫ్లోరింగ్ వంటి వాటిని పరిశీలించారు. బుర్రారెడ్డిపల్లె గ్రామంలోని రెండు పోలింగ్ కేంద్రాలు పూర్తిగా దెబ్బతినడంతో అంగన్‌వాడీ కేంద్రంలోకి మార్చేందుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతామని చెప్పారు.

హోరా హోరీగా క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నూనెపల్లె మున్సిపల్ మైదానంలో నంద్యాల మండల స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు హోరాహోరీగా సాగాయి. శుక్రవారం జరిగిన పోటీలకు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 9క్రీడాంశాల్లో ఎంపికైన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని కో ఆర్డినేటర్ గోపీకృష్ణ, హెచ్‌ఎం చలపతి, పీడీలు విజయభారత్‌రెడ్డి, ఏపీరెడ్డి తెలిపారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ

దొర్నిపాడు: మండలంలో నూతన పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. కొత్తగా 185 పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీఓ సుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. బుర్రారెడ్డిపల్లెలో 18, చాకరాజువేముల 40, దొర్నిపాడు-1 24, దొర్నిపాడు-2 11, గుండుపాపల 10, కొండాపురం 23, క్రిష్టిపాడు 16, డబ్ల్యూ గోవిందిన్నె 30, డబ్ల్యూ కొత్తపల్లెకు 13 పింఛన్లు వచ్చినట్లు చెప్పారు. వీటిని ఆయా గ్రామాల్లోని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు అందజేసినట్లు చెప్పారు. సర్పంచ్ శివరామిరెడ్డి, ఉప సర్పంచ్ మహేష్, సచివాలయ కన్వీనర్ పల్లె శివశంకర్‌రెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ గీతా పాల్గొన్నారు.

విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

చాగలమర్రి: ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అంతకుముందు ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి ర్యాలీ చేపట్టారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారికి జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ కె.వి.సుబ్బారెడ్డి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

చాగలమర్రి: ముత్యాలపాడు గ్రామంలోనున్న బర్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ నెల 9,10వ తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ జంప్ రోప్ పోటీల్లో ఏడుగురు పాల్గొనగా నలుగురు బంగారు, కాంస్య పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ ఎం.సిం. ధూర తెలిపారు. అక్టోబర్ 14,15,16వ తేదీల్లో నిర్వహించే పోటీలలో అండర్-12 విభాగంలో పాఠశాల తరఫున పి.సంజనశ్రీ, దస్తగిరి, వైష్ణవిలు,అండర్-14 విభాగంలో ఎ.కళ్యాణి పోటీలలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం విద్యార్థులు, వ్యాయమ ఉపాధ్యాయుడు రవిశంకర్, కో-ఆర్డినేటర్ భాస్కర్‌ను అభినందించారు.

ఆశా నోడల్ ఆఫీసర్లకు శిక్షణ

నంద్యాల టౌన్: ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలదే కీలక పాత్ర అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఆశా నోడల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక సభలు నిర్వహించి ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. డాక్టర్లు జయచంద్రారెడ్డి, ఎన్‌సీడీ నోడల్ ఆఫీసర్ కాంతారావు నాయక్, జగదీష్ చంద్రారెడ్డి, ప్రసన్న లక్ష్మీ, వీరన్న పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే



ఇంజనీర్లను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ ఇంజనీర్ల దినోత్సవం నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్, ఇంజనీరింగ్ అధికారి రామ్మోహన్, డాక్టర్ గెలివి సహదేవుడు మాట్లాడారు. అనంతరం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను సన్మానించారు.

ఉత్సవాలకు వేళాయే..



- గణేష్ విగ్రహాలకు డిమాండ్
- ఊపందుకున్న అమ్మకాలు
- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న ప్రతిమలు
- గతేడాది కంటే వ్యాపారం బాగుందంటున్న వ్యాపారులు
- ఇప్పటికే ప్రారంభమైన అడ్వాన్స్ బుకింగ్‌లు

మరో రెండు రోజుల్లో చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నెలకొల్పనున్న వినాయకుడి విగ్రహాలకు డిమాండ్ నెలకొంది. మూడు రోజుల క్రితం నుంచే కొనుగోళ్లు జోరందుకున్నాయి. గతేడాది కంటే వ్యాపారం బాగుందని విగ్రహాల విక్రయదారులు పేర్కొంటున్నారు. ఇక భారీ విగ్రహాలను హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి తమకు నచ్చిన ఆకృతుల్లో ఆర్డర్ ఇచ్చి మరీ కొందరు చేయించారు. వాటిల్లో కొన్ని ఇప్పటికే పట్టణానికి చేరుకున్నాయి. కాగా మండపాల ఏర్పాట్లు ఊపందుకున్నాయి.



వివిధ రూపాల్లో, అందమైన రంగుల్లో వినాయక ప్రతిమలు



విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు వచ్చిన యువకులు

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 18వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు సమయం దగ్గర పడుతుండటంతో గణేష్ విగ్రహాల విక్రయాలు ఊపందుకున్నాయి. నంద్యాల నియోజకవర్గ పరిధిలోని పట్టణం, పల్లెల్లో ప్రతి ఏడాది యువత ఎంతో ఆసక్తిగా గణపతి విగ్రహాలను కొనుగోలు చేసి నెలకొల్పుతారు. గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 600, పట్టణంలో 800కు పైగా విగ్రహాలు వెలియనున్నాయి. ఈ ఏడాది కేసీ కెనాల్, కుందూ నదులతో పాటు చిన్నచెరువులు, కాల్వల్లో నీటి ప్రవాహం ఉండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. దీంతో వారు భారీగా విరాళాలను ఇస్తుండడంతో ఉత్సవ కమిటీల నిర్వాహకులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. పల్లెల్లో మూడవరోజు, పట్టణంలో 5వరోజులపాటు సంప్రదాయబద్ధంగా విశేష పూజలు నిర్వహించి నిమజ్జనం ఆనవాయితీ.

అడ్వాన్స్ బుకింగ్‌లు ప్రారంభం..

పట్టణంలోని పద్మావతినగర్‌లో వ్యాపారులు గణేష్ ఉత్సవ విగ్రహాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. కొందరు వ్యాపారులు హైదరాబాద్, అనంతపురం జిల్లా గుంతకల్లు సమీపం నుంచి విగ్రహాలను తీసుకొచ్చి విక్రయిస్తుండగా మరికొందరు కేవలం గణేష్ ప్రతిమలను తీసుకొచ్చి, రంగులు వేసి విక్రయించడానికి ఏర్పాట్లు చేశారు. పలు ప్రత్యేకతలతో విగ్రహాలను ఆకట్టుకునేలా తీర్చి దిద్దారు. విగ్రహాల ఎత్తు 5 అడుగుల నుంచి 15అడుగుల వరకు ఏర్పాటు చేస్తారు. విగ్రహాల రూపురేఖలకు మెరుగులు వేసేందుకు కళాకారులు రాత్రింబవళ్లు పనులు చేస్తున్నారు. విగ్రహాల రకాలను బట్టి వాటి ప్రత్యేకతను బట్టి రూ.5వేల నుంచి రూ.70వేల వరకు ధర నిర్ణయించారు. విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆయా గ్రామాల మండపాల నిర్వాహకులు ముందస్తుగా తయారీదారులను ఆశ్రయించి అడ్వాన్స్‌లు చెల్లించి తమకు నచ్చిన రీతిలో విగ్రహాలను తయారీ చేయించుకున్నారు.

విగ్రహానికి అడ్వాన్స్ ఇచ్చేందుకు వచ్చా



వినాయక చవితి పండుగ దగ్గర పడుతుండటంతో విగ్రహాన్ని కొనేందుకు నంద్యాల కు వచ్చాం. విగ్రహాన్ని కొనుగోలు చేసేందుకు గతంలో హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది.కొనుగోలు చేసిన విగ్రహాలను తెచ్చేందుకు ఇబ్బందులు పడేవాళ్లం. ఈ ఏడాది నంద్యాలలోనే విగ్రహాల ధరలు అందుబాటులో ఉండటంతో ముందుగానే అడ్వాన్స్ ఇచ్చేందుకు వచ్చాం. విగ్రహాలు దగ్గరలోనే లభిస్తుండటంతో రవాణా ఖర్చులు కూడా తగ్గిపోయాయి.

– హుసేనయ్య, దొర్నిపాడు


విగ్రహాల వ్యాపారం బాగానే ఉంది



గత ఏడాది కంటే ఈ ఏడాది విగ్రహాల వ్యాపారం బాగానే ఉంది. కొనుగోలు చేసేందుకు ఆళ్లగడ్డ, ఆత్మకూరు, పాణ్యం నియోజకవర్గాలతో పాటు గిద్దలూరు, కంభం తదితర ప్రాంతాల నుంచి వస్తున్నారు. విగ్రహాలను అడ్వాన్స్ ఇచ్చి బుకింగ్ చేసుకుంటున్నారు. విగ్రహాల తయారీకి ఎంతో శ్రమించాల్సి వస్తుంది.

– రమణ, వ్యాపారి, బోయరేవుల, వెలుగోడు

పర్యావరణాన్ని కాపాడుదాం



నిర్వాహకులు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌వి వాడకుండా మట్టి విగ్రహాలను వాడాలి. పూజల్లో ప్రకృతి సిద్ధమైన సామగ్రిని వినియోగించాలి. దీని వల్ల జలకాలుష్యం కాకుండా, జలజీవరాసులు రక్షింపబడుతాయి.

– రామకృష్ణారెడ్డి, శ్రీ గణేష్ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు, నంద్యాల

మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి



విగ్రహ మండపాల వద్ద విద్యుద్దీపాలంకరణ, దీపారాధన తదితర విషయాల్లో నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలి. డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్‌లతో ఎవరికి ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మత్తు పదార్థాలు సేవించి నిమజ్జనంలో పాల్గొనరాదు. మండప పరిసర ప్రాంతాలు భక్తి భావంతో ఉండాలి. సమీప ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– రఘువీర్‌రెడ్డి, జిలా ఎస్పీ, నంద్యాల

గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచాలి

ఉయ్యాలవాడ : గృహ నిర్మాణాల్లో పురోగతి పెంచేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులపై ఉందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ నరసింహరావు, ఏపీఓ రవిప్రకాష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడా రు. అల్లూరు, ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, సర్వా యిపల్లె, ఇంజేడు గ్రామాల్లోనున్న జగనన్న లేఅవుట్‌లలో 281 గృహాలు మంజూరు కాగా కేవలం ఉయ్యాలవాడ, అల్లూరు గ్రామాల్లో ఇద్దరు చొప్పున లబ్ధిదారులు నిర్మాణాలు ప్రారంభించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ కుడా కింద 747 గృహాలు మంజూరు కాగా 400 పూర్తయ్యాయని, గ్రామీణ గృహ నిర్మాణం పథకం కింద 501 గృహాలు మంజూరు కాగా 12 పూర్తయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు గురుప్రసాద్‌రెడ్డి, సాయిరెడ్డి పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఉయ్యాలవాడ : మండలంలోని హరివరం గ్రామంలో శనివారం ఉదయం 9 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పాల్గొంటారని, మండలస్థాయి అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉయ్యాలవాడ : స్థానిక 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి తెల్లవారుజామున 5 నుంచి విద్యుత్ సరఫరా యథావిధంగా త్రీఫేస్ సరఫరా చేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అట్టహాసంగా మండల స్థాయి క్రీడా పోటీలు




అండర్-17 వాలీబాల్ పోటీల్లో బాలికలు

గోస్పాడు: మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం మండల కేంద్రంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంఈఓలు అబ్దుల్‌కరీం, సురేంద్రనాథ్ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇక్కడ ప్రతిభ చూపిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి ఎంపిక అవుతారని తెలిపారు. అండర్-17 బాలుర విభాగంలో కబడ్డీ విజేతలుగా మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలువగా జిల్లా పరిషత్ హైస్కూల్ దీబగుంట్ల విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. వాలీబాల్ పోటీల్లో యాళ్లూరు హైస్కూల్ విద్యార్థులు మొదటి స్థానం, గోస్పాడు హైస్కూల్ విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. అండర్-17 బాలికల ఖోఖో విభాగంలో కేజీబీవీ బాలికలు మొదటి స్థానం సాధించగా, దీబగుంట్ల హైస్కూల్ బాలికలు రెండోస్థానంలో నిలిచారు. త్రోబాల్ బాలికల విభాగంలో దీబగుంట్ల హైస్కూల్ బాలికలు మొదటి స్థానంలో నిలువగా కేజీబీవీ బాలికలు రెండోస్థానంలో నిలిచారు. అండర్-14 యోగా విభాగంలో 1, 2, 3 స్థానాలు దీబగుంట్ల హైస్కూల్ విద్యార్థులు గెలుపొందారు. పీడీలు సాల్మన్, విశ్వనాథ్, నాగశేషులు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

శిరివెళ్ల: ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు 30వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం కార్యక్రమం అమలుపై స్థానిక 1వ గ్రామ సచివాలయంలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ శిబిరాల కంటే ముందు 15వ తేదీ నుంచి ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. సర్వే ఆధారంగా ప్రజలకు నిర్ణయించిన తేదీల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. ఈ నెల 30న స్థానిక 2వ సచివాలయంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిబిరం ప్రారంభమవుతుందన్నారు. స్పెషలిస్ట్‌లు, ఇద్దరు మెడికల్ డాక్టర్లు శిబిరంలో వైద్య సేవలను అందిస్తారన్నారు. అలాగే అక్టోబర్ 3న యర్రగుంట్ల, 5న మహదేవపురం , 7న శిరివెళ్ల-3వ సచివాలయం, 10న గుంప్రమాన్‌దిన్నె, 12న గంగవరం, 16న జీనేపల్లె, 18న చెన్నూరు, 20న కోటపాడు, 25న బోయలకుంట్ల, 28న గుండంపాడు, 30న గోవిందపల్లెలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. డాక్టర్ విజయకుమార్, ఈఓ ఆర్డీ నాగేంద్ర, సర్పంచు సాలమ్మ,, సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



కర్నూల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హుసేన్‌వలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సాదిక్

చాగలమర్రి: స్థానిక 3వ సచివాలయ పరిధిలోని 13వ వార్డుకు చెందిన హుసేన్‌వలికి కొత్తగా వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. అయితే ఆయన మూత్రకోశ సంబంధిత వ్యాధితో కర్నూలులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ సాదిక్ అక్కడికి వెళ్లి శుక్రవారం పింఛన్ సొమ్ము అందజేశాడు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత




మాట్లాడుతున్న ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి

బొమ్మలసత్రం: పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నామని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఆరుగురి సిబ్బంది మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి ఎస్పీకి విన్నవించుకున్నారు.

హోంగార్డ్స్ సంక్షేమ దివస్..

జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో హోంగార్డ్స్ సంక్షేమ దివస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా హోంగార్డ్స్ సంక్షేమ దివస్‌ను ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.అనంతరం సిబ్బంది తమ సమస్యలను జిల్లా ఎస్పీకి తెలియజేశారు. హోంగార్డ్ కమాండెంట్ మహేశ్ కుమార్, అడిషనల్ ఎస్పీ .వెంకటరాముడు, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

సీఎం పర్యటనలో లోటుపాట్లు ఉండరాదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19వ తేదీన డోన్‌లో పర్యటించనున్న సందర్భంగా ఏర్పాట్లలో లోటు పాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఏఎస్పీ వెంకటరాముడుతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రోటోకాల్ ప్రకారం అధికారులకు అప్పగించిన పనులు బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. హెలిప్యాడ్ ల్యాండ్ అయ్యే ప్రదేశం, బహిరంగ సభా ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. డీఆర్‌ఓ పుల్లయ్య, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డోన్ ఆర్‌డీఓ వెంకటరెడ్డి, మండలాల తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.ఆప్తాల్మిక్ అసిస్టెంట్ నరసింహ వంద మంది విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 30 మందికి కళ్ల జోడు అవసరమని ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం



ఎం.తండాలో వృద్ధుడికి పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: ప్రజల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ముత్యాలపాడు సచివాలయం-2 పరిధిలోని ముత్యాలపాడు తండా, చక్రవర్తులపల్లె గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఒక్క మెడికల్ కళాశాల కూడా కొత్తగా నిర్మించలేదన్నారు. ముఖ్యమంత్రి జగనన్న 17 నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను మంజూరు చేశారన్నారు. వాటిలో శుక్రవారం 5 కళాశాలలను ప్రారంభించారన్నారు. అలాగే 5 గిరిజన ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య కళాశాలలను నిర్మిస్తున్న ఘనత జగనన్నకె దక్కుతుందన్నారు. అలాగే ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ నెల 15వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్, మండల కన్వీనర్ జి.కుమార్‌రెడ్డి, ఎంపీపీ వీరభద్రుడు, వైస్ ఎంపీపీ ముల్లా.రఫి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషు రమేష్, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, ఎంఈఓ న్యామతుల్లా, ఉద్యానవన శాఖ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి సాయిబాబా తదితరులున్నారు.

విజయవంతం చేయాలి

నంద్యాల(అర్బన్): ప్రజలకు సకాలంలో సరైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సుగుణశ్రీ కోరారు. మండలంలోని చాబోలు, అయ్యలూరు గ్రామాల్లో వలంటీర్లు, ఏఎన్‌ఎంలతో కార్యక్రమ నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుంచి వైద్య సిబ్బంది,ఆశా వర్కర్లు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు తెలుసుకోవాలన్నారు. 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

నంద్యాల(అర్బన్): బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని మదర్ సొసైటీ సీఈఓ టిక్కీ రామారావు తెలిపారు. శనివారం మండల న్యాయసేవా అధికార సంస్థ న్యాయ విజ్ఞాన సదస్సు ఆధ్వర్యంలో స్థానిక టెక్కె పాఠశాలలో చైల్డ్ మ్యారేజ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. మదర్‌సొసైటీ, బర్డ్స్, వరల్డ్ విజన్ ఇండియా స్వచ్ఛంద సంస్థల పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో రామారావు మాట్లాడారు.

నేటి నుంచి జిల్లాస్థాయి రెజ్లింగ్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల పరిధిలో అన్ని మేనేజ్‌మెంట్ పాఠశాలలకు చెందిన అండర్-14, 17 బాలబాలికల ఉమ్మడి జిల్లా స్థాయిలో రెజ్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీలు లక్ష్మయ్య, పి.శ్రీనాథ్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్ పాఠశాల మైదానంలో ఉదయం 10 గంటలకు ఫ్రీస్టైల్, గ్రీకో రోమన్ పద్ధతిలో ఎంపిక పోటీఉల ఉంటాయని చెప్పారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని పీఈటీలు, పీడీలు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్‌లైన్ ఎంట్రీ చేసుకొని మ్యాన్‌వల్ ఎంట్రీ ఫారంతో వచ్చి ఎంపికలో పాల్గొనాలన్నారు. అక్రిటేషన్ ఫారంను హెచ్‌ఎం ద్వారా ధ్రువీకరించి తీసుకు రావాలన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎపీడీఓ మహబూబ్‌దౌలా, ఎంఈఓ-2 న్యామతుల్లా తనిఖీ చేశారు. వంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. అలాగే రూ.16.00 లక్షలతో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించారు.

పైప్‌లైన్ నిర్మాణానికి భూమి పూజ

నంద్యాల (సిటీ): పట్టణంలోని వైఎస్సార్ నగర్‌లో పైప్ లైన్ నిర్మాణానికి మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా శుక్రవారం భూమి పూజ చేశారు. కౌన్సిలర్ సావిత్రమ్మ, వార్డ్ ఇన్‌చార్జ్ రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ పైప్ లైన్ నిర్మాణానికి రూ.9లక్షలు మంజూరయ్యాయని చెప్పారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

ఆళ్లగడ్డ: పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పట్టణ సీఐ రమేష్‌బాబు తెలిపారు. సాయంత్రం స్థానిక అమ్మవారిశాలలో శుక్రవారం రాత్రి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. విగ్రహాలను ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రతిష్ఠించాలని సూచించారు. నిబంధనలు పాటించాలని కోరారు. ఫైర్ ఆఫీసర్ వీరారెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, నాయకులు విష్ణు, టీఎంసీ వేణుగోపాల్, మోహన్‌రెడ్డి ఉన్నారు.

పేదవాడి గుండె చప్పుడు తెలిసిన నాయకుడు జగనన్న



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): పేదవాడి గుండె చప్పుడు తెలిసిన గొప్ప నాయకుడు జగనన్న అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 16వ వార్డు ఎస్‌బీఐ కాలనీలో కౌన్సిలర్ విజయభాస్కర్‌తో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తిగా ఉన్నారా అని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, దీంతో లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా మెరుగపడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సిద్ధం శివరాం, మాజీ కౌన్సిలర్ చింత శ్రీనివాస్, వాసగిరి రమేష్ ,వాసగిరి సుధాకర్, టైలర్ శివ, పరమేశ్వర రాజశేఖర్, శంకర్ నాయక్, ఆర్‌వీ సుబ్బారెడ్డి, సుధాకర్, బోయ సుబ్బరాయుడు, రామచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గిరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాకీ సొమ్ము అడిగినందుకు దాడి

దొర్నిపాడు: అప్పుగా ఇచ్చిన సొమ్ము తిరిగి చెల్లించాలని అడిగినందుకు దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం చాకరాజువేముల గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుపాల్ తెలిపిన వివరాల మేరకు.. అక్కల రామకృష్ణ అదే గ్రామానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తికి రూ.30వేలు అప్పుగా ఇచ్చాడు. అప్పు చెల్లించాలని అడగటంతో అతని కుమారుడు మాధవ్, తమ్ముడు లక్ష్మినారాయణ, కుమారుడు విజయ్ కలిసి రామకృష్ణపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

విషాహారం తిని గొర్రెలు మృతి

రుద్రవరం: మండలంలోని ముత్తలూరులో విష గ్రాసం తిని 10 గొర్రెలు మృతి చెందగా మరో 15 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన హుసేన్ వలి అనే రైతు 30 గొర్రెలను పెంచుతున్నాడు. దినచర్యలో భాగంగా శుక్రవారం గొర్రెలను మేపుకునేందుకు గ్రామ సమీపంలోనున్న ఆనాథ ఆశ్రమం వైపు వెళ్లాడు. బీడు పొలంలో గ్రాసం మేస్తు పక్కనే పొలం గట్టుపై ఉన్న గ్రాసాన్ని తిన్నాయి. కొద్ది సేపటికే గొర్రెలు ఒకదాని తరువాత మరొకటి కుప్ప కూలాయి. వెంటనే రైతు పరిశీలించగా గట్టుపై విషపు గ్రాసాన్ని తినడం వల్లే అలా జరిగిందని తెలుసుకొని వెంటనే ఎర్రగుడిదిన్నె పశు వైద్య సిబ్బందికి విషయాన్ని తెలియ జేయడంతో వారు అక్కడికి చేరుకొని వైద్యం చేశారు. అయితే అప్పటికే పది గొర్రెలు మృతి చెందాయని దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

నయన ఆసుపత్రికి ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని పద్మావతినగర్‌లో ఉన్న నయన ఐకేర్, డెంటల్ రీసెర్చ్ సెంటర్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(హెచ్‌ఏబీహెచ్) గుర్తింపు లభించిందని హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఏ.విజయభాస్కర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ గుర్తింపు 2025 జూలై 24వ తేదీ వరకు ఉంటుందన్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న అత్యుత్తమ వైద్య సేవలకు గుర్తింపు లభించిందన్నారు.